సిబ్బంది తక్కువ...చెత్త ఎక్కువ

- పెడనలో పేరుకు పోతున్న చెత్త
- జనాభా లెక్కల ప్రకారం 90 మంది సిబ్బందికి 40 మంది మాత్రమే..
- వార్డుకు ఒకరు.. నాలుగైదు రోజులకొకసారి చెత్త సేకరణ
- డ్రయివర్లు, సిబ్బంది కొరత
- కదలని చెత్త సేకరణ వాహనాలు



గూడూరు రోడ్డులోని రైలు గేటు సమీపంలో పేరుకున్న చెత్త నిల్వలు



17వ వార్డులో పూడిక తీయని మురుగుకాలువ



పెడన గ్రంథాలయం శాఖ వద్ద చెత్త

పెడన: పారిశుద్ధ్య సిబ్బంది తక్కువ.. పని ఎక్కువ.. ఎక్కడ పడితే అక్కడ పేరుకున్న చెత్త నిల్వలు ఈ చిత్రాలు పెడనలో ఎదురవుతున్నాయి. దీంతో పెడన మునిసిపాలిటీలోని పలుప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతోంది. 'కూటమి' పాలనలో పారిశుద్ధ్యంపై అధికారులు శ్రద్ధ చూపకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పారిశుద్ధ్య సిబ్బంది తక్కువ మంది ఉండటంతో వారిపై పనిభారం అధికమవుతోంది. వారు కూడా పూర్తి స్థాయిలో పనులు చేయక సెలవులపై సెలవులు పెడుతున్నారు.

500 మందికి ఒకరు ఉండాలి.. కానీ వార్డుకు ఒకరు

పట్టణంలో 35వేల మంది జనాభా ఉన్నారు. ఈ గణాంకాల ప్రకారం ఇక్కడ చెత్త సేకరణకు 70 మంది అవసరం. వీరు కాకుండా చెత్తను సేకరించి ట్రాక్టర్లు రెండు, గార్బేజ్ వాహనాలు రెండు ఉన్నాయి. ఒక్కో వాహనానికి ఒక డ్రయివరు, ముగ్గురు పారిశుద్ధ్య కార్మికులుండాలి. నాలుగు వాహనాలకు 16 మంది అవసరం. అది కాకుండా కమర్షియల్ ప్రాంతాల్లో అంటే వాణిజ్య సముదాయాలున్న చోట సిబ్బందిని అదనంగా నియమించాలి. అంటే మరొక నలుగురు వెరసి మొత్తం పెడన పట్టణంలో చెత్త సేకరణకు సుమారు 90 మంది అవసరం. ప్రస్తుతం 40 మంది మాత్రమే విధుల్లో ఉన్నారు. వీరిలో కొందరు పారిశుద్ధ్య విభాగంలో చేరి ఆఫీసు కార్యాలయంలోనే విధులు నిర్వహిస్తున్నారు. దీంతో చెత్త సేకరణ అగమ్యగోచరంగా మారింది.

అధిక భారం

చెత్త ఎత్తేవారు, ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించే వారు కరవయ్యారు. సెలవు రోజులు వచ్చినా, సిబ్బంది సెలవు పెట్టినా, ఎవరైనా చనిపోయినా, అనారోగ్యం పరిస్థితులతో దీర్ఘకాలం సెలవు పెట్టినా వారి స్థానంలో ఎవరినీ నియమించకపోవడంతో ఉన్న వారిపై భారం అధికమవుతోంది. సిబ్బంది అరకొరగా ఉండటంతో ఎక్కడి చెత్త నిల్వలు అక్కడే ఉండిపోతున్నాయి. కొందరు మచిలీపట్నంలో కమిషనర్ ఇంటి వద్ద, మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య విభాగం కింద నియమితులైన వారు కార్యాలయంలోనే విధులు నిర్వహిస్తున్న వారిని మినహాయిస్తే పట్టణంలో పారిశుద్ధ్య విధులు చేసే వారి సంఖ్య 30కు మించి ఉండటం లేదని తెలుస్తోంది. పట్టణంలో రోజుకు 19 మెట్రిక్ టన్నుల చెత్త వస్తుంది. దీంతో ఎక్కడి చెత్త అక్కడే ఉండటాన్ని చూస్తున్న పురప్రజలు ఇదెక్కడి దుస్థితి రా బాబు అంటూ వాపోతున్నారు.

సిబ్బంది లేక కదలని వాహనాలు



వెహికల్ పార్కింగ్ పాయింట్‌లో చెత్త సేకరణ చేసిన ట్రాక్టరు, పక్కనే గార్బేజ్ వాహనం

అరకొరగా ఉన్న సిబ్బంది చెత్తను సేకరిస్తున్నా దాన్ని డంపింగ్ యార్డుకు తరలించడానికి కూడా సిబ్బంది కొరత ఉంది. చెత్తను తీసుకువెళ్లే వాహనాలను సైతం వెహికల్ పార్కింగ్ పాయింట్‌లోనే ఉంచేస్తున్నారు. ట్రాక్టరులో చెత్తను ఉంచేయడం గమనార్హం. ఈ సమస్యపై కౌన్సిల్‌లో వైఎస్సార్ సీపీ పాలకవర్గం గళమెత్తినా అధికారులు స్పందించడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెత్త సేకరణ సమస్యపై చర్యలు తీసుకోవాల్సి ఉంది.

అదనంగా సిబ్బందిని తీసుకుని పని చేయిస్తా



సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమే. అదనంగా సిబ్బందిని తీసుకుని పని చేయించి పారిశుద్ధ్య పనులు ముమ్మరం చేయిస్తాను. వార్డు సచివాలయాల్లో విధుల్లో ఉంటున్న శానిటరీ కార్యదర్శులను సైతం అప్రమత్తం చేసి పారిశుద్ధ్య సిబ్బంది విధులకు సక్రమంగా హాజరయ్యేలా చర్యలు తీసుకుంటాను. పురపాలకులు చేసిన ఫిర్యాదులపై తక్షణం స్పందించి ఆయా ప్రాంతాల్లో సిబ్బందిని పంపించి చెత్త లేకుండా చూస్తున్నాం. పటిష్ట చర్యలు తీసుకుంటాం.

–ఎం.గోపాలరావు, కమిషనర్, పురపాలక సంఘం, పెడన

క్లుప్తంగా

పుస్తకాలు, జామెట్రీ బాక్సుల పంపిణీ



చల్లపల్లి: నడకుదురు పంచాయతీ శివారు రాముడుపాలెం ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ బాలబాలికలకు ఏపీ సెక్రటేరియట్ న్యాయశాఖ జాయింట్ సెక్రటరీ వెలగపల్లి వెంకటేశ్వరరావు సోమవారం పుస్తకాలు, పలకలు, జామెట్రీ బాక్సులు అందజేశారు. చిన్నం కోటేశ్వరరావు, ఎం.నరసింహారావుతదితరులు పాల్గొన్నారు.

24న సీజీఆర్ఎఫ్

చల్లపల్లి: విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించడానికి ఈ నెల 24వ తేదీన కన్స్యూమర్ గ్రీవెన్సెస్ రెడ్రెస్సెల్ ఫోరం(సీజీఆర్ఎఫ్) విజయవాడ ఆధ్వర్యంలో విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఉయ్యూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కృష్ణనాయక్ తెలిపారు. పెదకళ్లేపల్లి రోడ్డులోని వర్తక సంఘం ఫంక్షన్ హాల్లో ఆ రోజు ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకూ కొనసాగుతుందని పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయాలు, హెచ్చు తగ్గులు, మీటరు, బిల్లుల సమస్యలు, విద్యుత్ సరఫరాకు సంబంధించిన ఇతర అన్ని సమస్యలను అర్జీలపై రాసి దానిపై సర్వీస్ నెంబర్, అడ్రస్, సెల్ నంబర్ సమర్పించి సమస్యలు పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

మోపిదేవిలో రైతుబజారు ఏర్పాటు చేయండి

మోపిదేవి: మోపిదేవిలో రైతుబజారు ఏర్పాటు చేయాలని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డెప్యూటీ తహసీల్దార్ వాణికి కోసూరువారిపాలెం మాజీ ఉప సర్పంచ్, జనసేన నేత కోసూరు రామాంజనేయులు వినతి పత్రం అందచేశారు. సోమవారం రెవెన్యూ కార్యాయంలోని మీకోసంలో ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఇటీవల భూ రీ సర్వేకు కోసూరువారిపాలెంకు విచ్చేసిన కలెక్టర్‌కు రైతు బజారు ఆవశ్యకతను వివరించి అర్జీకూడా ఇచ్చామన్నారు. గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నడుస్తున్నాయన్నారు న్నారన్నారు. మోపిదేవిలో డ్రైనేజీ వ్యవస్థ దారుణంగా ఉందని తెలిపారు.

వ్యవసాయ పరికరాలకు అర్జీలు స్వీకరణ

చల్లపల్లి: వ్యవసాయ పనిముట్లను సబ్సిడీపై ఇవ్వడానికి రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి సాయిసింధు సోమవారం తెలిపారు. ట్రాక్టర్ పనిముట్లు, స్ప్రేయర్లు ప్రభుత్వం ద్వారా అందజేయనున్నట్లు వివరించారు. అవసరమైనవారు రైతు సేవా కేంద్రాల్లో అర్జీలు అందజేయాలని సూచించారు.

పేదల జీవనోపాధికి కృషి

కోడూరు: గ్రామీణ ప్రాంత పేదల జీవనోపాధి మార్గాలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని రామకృష్ణాపురం శివారు ఊటగుండం గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన పశువుల నీటి తొట్టెను బుద్ధప్రసాద్ ప్రారంభించారు. పశు పోషకులకు ప్రోత్సాహం అందించేందుకు గేదెలు, గొర్రెలు, మేకల పెంపకానికి సంబంధించి ఇప్పటికే అనేక మినీ గోకులాలు నిర్మించినట్లు బుద్ధప్రసాద్ చెప్పారు. నియోజకవర్గంలో రూ.5.38లక్షల నిధులతో 14 నీటి తొట్టెలను నిర్మాణాలను ప్రారంభించి, ఇప్పటికే ఐదు తొట్టెలను ప్రారంభించినట్లు చెప్పారు. అనంతరం రామకృష్ణాపురంలో రూ.2.30 లక్షలతో లబ్ధిదారుడు గొరిపర్తి శ్రీనివాసరావు నిర్మించిన మినీ గోకులాన్ని ప్రారంభించారు. ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ సుధాప్రవీణ్, కార్యదర్శి ఏడుకొండలు, ఏపీఓ రవికుమార్, నేతలు పాల్గొన్నారు.

రేపు కానుకల లెక్కింపు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లిలోని శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి హుండీ కానుకల లెక్కింపు ఈనెల 23వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు లెక్కించనున్నట్లు ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ సమక్షంలో ఆలయ ప్రాంగణంలో నిర్వహించే లెక్కింపులో పాల్గొనే భక్తులు డ్రెస్ కోడ్‌లో పాల్గొనవచ్చని వివరించారు.

దాతల సాయాన్ని వినియోగించుకోండి

బంటుమిల్లి: దాతలు చేస్తున్న సాయాన్ని వినియోగించుకోవాలని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. మలపరాజుగూడెం, పెదతుమ్మిడి ఉన్నత పాఠశాలలకు డెక్కన్ ఫైన్ కెమికల్స్ లిమిటెడ్ వారు బహూకరించిన లక్షలాది రూపాయలు విలువ చేసే ఫర్నిచర్, ఆట వస్తువులు, ఎల్రక్టానిక్ పరికరాలను సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమాల్లో హెచ్ఎంలకు అందజేశారు. కార్యక్రమంలో డీసీ చైర్మన్ కాశీ, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు కూనపురెడ్డి వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలి

కృత్తివెన్ను: రేషన్ కార్డుల్లోని సభ్యులందరూ ఈకేవైసీ చేయించుకోవాలని డెప్యూటీ తహసీల్దార్ శశికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చే సంక్షేమ పథకాలు రావాలంటే ఈకేవైసీ తప్పనిసరి అని పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీ ఈకేవైసీకి ఆఖరని తెలిపారు.

అనాథ మృతదేహం ఖననం

వెంకటాపురం(మోపిదేవి): వెంకటాపురం బస్‌స్టాప్‌లో గుర్తు తెలియని యాచకుడు మృతి చెందాడు. గ్రామ పంచాయతీ కార్యదర్శి సుధాకరరావు తెలిపిన వివరాల మేరకు కొంతకాలంగా వెంకటాపురం పరిసరాల్లో యాచన చేస్తూ బస్‌షెల్టర్‌లో తలదాచుకుంటున్నాడని, అనా రోగ్యంతో ఆదివారం మృతిచెందినట్లు తెలిపారు. మృతుని వద్ద ఆధారాలు లేకపోవడంతో కార్యదర్శి ఇచ్చిన సమాచారంతో రెవెన్యూ అధికారులు అనాథగా గుర్తించారు. పంచాయతీ నిబంధనల మేరకు సోమవారం మృతదేహాన్ని మాజీ సర్పంచ్ నాంచారయ్య, వీఆర్వో వరప్రసాదరావు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొని శవాన్ని ఖననం చేసినట్లు కార్యదర్శి సుధాకరరావు వివరించారు.

ఇక నుంచి అన్ని రోజులూ పన్నులు చెల్లించవచ్చు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలు చెల్లించాల్సిన ఆస్తి, ఖాళీ స్థల, తాగునీటి పన్నులను ఇకపై ఏడాదిలో అన్ని రోజులూ చెల్లించే వెసులుబాటును రాష్ట్ర ప్రభుత్వం కల్పించిదని కమిషనర్ బాపిరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ముఖ్యమైన పండుగ దినాల్లో పన్నుల చెల్లింపు కౌంటర్లకు సెలవు ఉండేదని దీన్ని ప్రస్తుతం రద్దు చేసి అన్ని రోజుల్లోనూ నగరపాలక సంస్థ కార్యాలయంలోని రెవెన్యూ కౌంటర్లలో పన్నులు చెల్లించవచ్చని వివరించారు. భోజన విరామం కూడా లేకుండా ప్రతి రోజూ ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకూ కౌంటర్లలో సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు.

అన్నక్యాంటిన్ పని వేళలు పెంపు

మచిలీపట్నంటౌన్: నగరంలోని అన్న క్యాంటిన్ పని వేళలను పెంచినట్లు కమిషనర్ బాపిరాజు సోమవారం తెలిపారు. మూడు స్తంభాల సెంటర్‌లో ఉన్న క్యాంటిన్‌లో ఉదయం టిఫిన్ 7 నుంచి 9.30 గంటల వరకూ, మధ్యాహ్నం భోజనం 12 నుంచి 2.30 గంటల వరకూ, రాత్రి భోజనం 7 గంటల నుంచి 9 గంటల వరకూ అందుబాటులో ఉంటుందని వివరించారు.

రాజకీయ యోధుడు బ్రాహ్మణయ్య

మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



బ్రాహ్మణయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సింహాద్రి, శేషగిరి తదితరులు

నాగాయలంక: దివిసీమలో గొప్ప రాజకీయ యోధుడిగా నిలిచిన బందరు మాజీ ఎంపీ, అవనిగడ్డ, బందరు మాజీ ఎమ్మెల్యే అంబటి బ్రాహ్మణయ్య 12వ వర్ధంతి స్థానిక పంచాయతీ కార్యాలయం సెంటర్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, వైఎస్సార్ సీపీ మండల పార్టీ కన్వీనర్ భోగాది శేషగిరిరావు తొలుత బ్రాహ్మణయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ దివిసీమ రాజకీయ చరిత్రలో నీతి, నిజాయతీలకు నిఖార్సైన నేతగా బ్రాహ్మణయ్య కీర్తి గడించారని జోహార్లు అర్పించారు. బ్రాహ్మణయ్య తనయుడు మాజీ ఎమ్మెల్యే అంబటి శ్రీహరిప్రసాద్(హరిబాబు) తండ్రికి తగ్గ తనయుడని అభినందించారు. పార్టీ రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీ చెన్ను రంగారావు, మద్ది చిన్నారి, బీసాబత్తుని ప్రసాద్, తోట సాయిబాబు, రాంబాబు, పార్టీ నేతలు వక్కపట్లవారిపాలెం గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

అమెరికాతో ఒప్పందం రైతులకు నష్టం

బంటుమిల్లి: భారతీయ వ్యవసాయ ఉత్పత్తులపై భారత్ ప్రభుత్వం అమెరికా ప్రభుత్వంతో చేసుకునే ఒప్పందం కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతారని రైతు సంఘం పెడన డివిజన్ కార్యదర్శి గొరిసెట్టి నాగేశ్వరరావు ఆరోపించారు. దేశ పర్యటనలో భాగంగా అమెరికా వైస్ ప్రెసిడెంట్ జేడీ వాన్స్ చేసుకునే ఆర్థిక ఒప్పందాలు మంచివికావన్నారు. ఇప్పటికే రైతులు పండించిన ధాన్యం, మినుములు, ఆక్వా ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు రాక నష్టపోతున్నారని నాగేశ్వరరావు తెలిపారు. ఆర్థిక ఒప్పందాలకు నిరసనగా సోమవారం అంబేడ్కర్ సెంటరులో నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ముగిసిన పోషణ్ పక్వాడా పక్షోత్సవాలు

బంటుమిల్లి: పదిహేను రోజులుగా ఐసీడీఎస్ ఆధ్వర్యాన జరుగుతున్న పోషణ్ పక్వాడా పక్షోత్సవాలు సోమవారంముగిశాయి. మండల పరిషత్ కార్యాలయంలో ముగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ చినబాబు, ఎంపీడీవో శైలజాకుమారి, సీడీపీవో సముద్రవేణి, వైస్ ఎంపీపీ ఓ చిన్నారిబాబు, ఎంఈవో వెంకటేశ్వరరావు, ఏపీఎం దశరథ్‌లు పాల్గొని గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం పౌష్టికాహారం ఎగ్జిబిషన్‌ను సందర్శించారు.

గూడూరు: గూడూరు అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటుచేసిన పోషణ్ పక్వాడాలో గూడూరు ఎంపీపీ సంగా మధుసూదనరావు, సర్పంచి లింగం సులోచనారాణి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా యూనివర్సిటీలో ఇంజనీరింగ్ ప్రాజెక్ట్ ఎక్స్‌పో



రుద్రవరం(మచిలీపట్నంరూరల్): రుద్రవరంలోని కృష్ణా యూనివర్సిటీ ప్రాంగణంలో సోమవారం ఇంజినీరింగ్ ప్రాజెక్ట్ ఎక్స్‌పో జరిగింది. ఈ సందర్భంగా వీసీ ఆచార్య కె.రాంజీ మాట్లాడుతూ ఇంజినీరింగ్ నాలుగో సంవత్సరం విద్యార్థులు చివరి సెమిస్టర్ ప్రాజెక్ట్ వర్క్‌లో భాగంగా ప్రాజెక్ట్ ఎక్స్‌పో కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. దీన్ని క్షుణ్ణంగా పరిశీలించి ప్రాజెక్ట్ ఫలితాలు, వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వర్సిటీ రెక్టార్ ఆచార్య ఎం.వి. బసవేశ్వరరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్.ఉష, ఇంజినీరింగ్ కళాశాల డీన్, ఎల్రక్టానిక్స్ విభాగాధిపతి ఆచార్య వై. కె.సుందరకృష్ణ, ప్రిన్సిపాల్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించండి

కొత్తపల్లి(ఘంటసాల): ఉపాధి కూలీల పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శీలం నారాయణరావు డిమాండ్ చేశారు. కొత్తపల్లి గ్రామంలో ఉపాధి పనులను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా బృందం సోమవారం పరిశీలించారు. సంఘ నేతలు మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరంలో చేసిన 8 వారాల పని దినాలకు వేతనాలు రాలేదని కార్మికులు చెప్పారన్నారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం చేసిన పనికి 15 రోజుల్లో వేతనాలు ఇవ్వాల్సి ఉండగా నెలలు గడుస్తున్న 8 వారాల నగదును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సకాలంలో ఉపాధి కార్మికులకు చెల్లించాలన్నారు. ఉపాధి పనులను 200 రోజులకు పెంచాలని, రోజువారి వేతనం రూ.600లు పెంచాలని డిమాండ్ చేశారు. మా పరిశీలనలోకి వచ్చిన సమస్యలను గుర్తించి మే 5న జిల్లా కలెక్టరేట్ వద్ద ధర్నా చేపడతామని తెలిపారు. జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కమిటీ సభ్యుడు మేడంకి వెంకటేశ్వరరావు, కౌలు రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు వాకా రామచంద్రరావు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

అప్‌గ్రేడ్ చేసిన జెడ్పీ పాఠశాలను వినియోగించుకోండి

కోడూరు: అప్‌గ్రేడ్ చేసిన జెడ్పీ ఉన్నత పాఠశాలలను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. మండలంలోని రామకృష్ణాపురం ప్రాథమికోన్నత పాఠశాలను జెడ్పీ పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయడంతో, ఆ స్కూల్‌ను బుద్ధప్రసాద్ సందర్శించి సభలో మాట్లాడారు. పాఠశాలకు అవసరమైన స్థలాన్ని కొనుగోలు చేసేందుకు సహకరించిన పారిశ్రామికవేత్త నడిపల్లి చినవెంకటరాజును, ఉపాధ్యాయులను ప్రశంసించారు.

- 'మనబడికి పోదాం' పోస్టర్లను బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. పీసీ కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ సుధాప్రవీణ్, ఎంఈఓలు టి.వి. ఎం.రామదాసు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు

గూడూరు: తరకటూరు పంచాయతీ కార్యదర్శి వ్యవహార శైలిపై సర్పంచి చిన్నం వెంకట రమణమ్మతో పాటు 8 మంది వార్డు సభ్యులు సోమవారం పీజీఆర్ఎస్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్సీ రిజర్వేషన్‌లో సర్పంచి అయిన తనకు పంచాయతీ కార్యదర్శి సరైన గౌరవం ఇవ్వకుండా తక్కువ చేసి చూస్తున్నారన్నారు. పంచాయతీ కార్యాలయానికి వెళ్తే కుర్చీ చివరకు వేసి అవమానిస్తున్నారని ఈ సందర్భంగా సర్పంచి చిన్నం వెంకట రమణమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యతారహితంగా వ్యవహరిస్తున్న పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

రూ.10,011 విరాళం అందజేత

చల్లపల్లి: మోపిదేవి మండలం పెదప్రోలు గ్రామ పంచాయతీ శివారు శివరామపురానికి చెందిన సీనియర్ స్వచ్ఛ కార్యకర్త రావెళ్ల శివరామకృష్ణయ్య కుమారుడు నాగవరప్రసాద్ మనకోసం మనం ట్రస్టుకు రూ.10011లు విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ట్రస్టు అకౌంటుకు బదిలీ చేసినట్లు తెలిపారు.

పింఛన్లు ఇప్పించడయ్యా!

ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌కు విజ్ఞప్తి

ఘంటసాల: పింఛన్లు రాక ఇబ్బంది పడుతున్నామని వాటిని ఇప్పించాలని పలువురు ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు విన్నవించారు. ఘంటసాల గ్రామంలో ఓ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పక్కనే జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పోతార్లంక లక్ష్మీకుమారి భర్త మరణించి ఆరు నెలలు దాటుతున్నా ఇప్పటి వరకు పెన్షన్ రాలేదని, దీంతో ఇబ్బంది పడుతున్నామని, ఎన్నిసార్లు కార్యాలయాలకు వెళ్లి అడిగినా ఇంకా మంజూరు కావడం లేదంటున్నారని వాపోయారు. సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే త్వరలోనే పెన్షన్లు మంజూరు చేస్తారని కార్యాలయాలకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

ఉర్దూ ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలి

చల్లపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉర్దూ స్కూల్ అసిస్టెంట్ పోస్టును భర్తీ చేయాలని ముస్లిం మైనార్టీ నాయకులు సోమవారం హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు రమాదేవికి వినతిపత్రం సమర్పించారు. ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి వరకూ ఉర్దూను ప్రథమ భాషగా చదివిన ముస్లిం విద్యార్థినీ విద్యార్థులు హైస్కూల్‌కు వచ్చేసరిగి ఉర్దూ ఉపాధ్యాయులు లేక ఇబ్బంది పడుతున్నారన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో మండల కో–ఆప్షన్ సభ్యులు జనాబ్ షేక్ నబీ, కరీముల్లా, మసీదు కమిటీ ప్రెసిడెంట్ అబూ సయీద్ ఉన్నారు.

గూడూరు: మండల పరిధిలోని పలు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఉర్దూ ఉపాధ్యాయులను నియమించాలని గూడూరు జెడ్పీటీసీ సభ్యుడు వేముల సురేష్ రంగబాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం మచిలీపట్నం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన మీకోసం కార్యక్రమంలో వినతిపత్రం సమర్పించినట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో గూడూరు, పటాన్‌పేట, పినగూడూరులంక, తరకటూరు, మల్లవోలు, పోలవరం, ఆకులమన్నాడు, షా అబ్దుల్లా పాలెం గ్రామాల్లో ఉర్దూ ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయన్నారు. వీటిలో ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వం అమలు చేయనున్న మోడల్ స్కూల్ కాన్సెప్ట్‌లో గూడూరు, మల్లవోలు, తరకటూరు, కప్పలదొడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఉర్దూ పోస్టులు మంజూరు చేయాలని ఆయన కోరారు.

సింగిల్ నంబర్ లాటరీ నిర్వహిస్తే నగర బహిష్కరణ

- ఆరుగురు అరెస్ట్, 19 మందిపై కేసు నమోదు
- అవనిగడ్డ డీఎస్పీ విద్యశ్రీ



చల్లపల్లిలో మాట్లాడుతున్న డీఎస్పీ విద్యశ్రీ, పక్కన సీఐ ఈశ్వరరావు, ఎస్ఐ సుబ్రహ్మణ్యం

చల్లపల్లి: నిషేధిత సింగిల్ నంబర్ లాటరీ ఆడినా.., నిర్వహించినా, వారికి సహకరించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి నగర బహిష్కరణ కూడా చేస్తామని అవనిగడ్డ డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ హెచ్చరించారు. ఈ నెల 20న ఎస్ఐ పీఎస్వీ సుబ్రహ్మణ్యం సిబ్బందితో, స్పెషల్ టీమ్ సభ్యులతో కలిసి చల్లపల్లి శివారు అవనిగడ్డ రోడ్డులోని బళ్లా సుబ్బనాగన్నగారి ఆశ్రమం సమీపానికి వెళ్లారు. అక్కడ సింగిల్ నంబర్ లాటరీ నిర్వహిస్తున్న పసుపులేటి లీలాప్రసాద్, మహ్మద్ మస్తాన్(చినబాబు), ముచ్చు రామసుబ్బారావు, పఠాన్ ఫరీద్‌బాబా, మెండు వీరబాబు, కుంభా నాగమల్లేశ్వరరావు(చమురు)లను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. ఈసందర్భంగా డీఎస్పీ విద్యశ్రీ సోమవారం చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటుచేశారు. డీఎస్పీ మాట్లాడుతూ కొంతకాలంగా సింగిల్ నంబర్ లాటరీ నిర్వాహకులుగా ఉంటూ ప్రజల వద్ద నుంచి డబ్బులు వసూలు చేయటానికి ఏజెంట్లను నియమించుకుని కార్యకలాపాలు సాగిస్తున్నారన్నారు. అదుపులోకి తీసుకున్న నిర్వాహకులను విచారించిన తర్వాత మొత్తం 19 మందిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసిన ఆరుగురిని మొవ్వ కోర్టుకు రిమాండ్ నిమిత్తం పంపుతున్నట్లు తెలిపారు. అరెస్ట్ చేసిన వారి సెల్‌ఫోన్లలను పరిశీలిస్తున్నామని చెప్పారు. అతిథి గృహాలపై నిఘా పెడతామని తెలిపారు. మిగిలిన వారిని కూడా త్వరలో అదుపులోకి తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు, ఎస్ఐ సుబ్రహ్మణ్యం, పోలీసులు, స్పెషల్ టీమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగుజాతి హృదయాలను తాకిన ఘంటసాల గానం



ఘంటసాలలో హెరిటేజ్ వాక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

ఘంటసాల: కుల మతాలకు అతీతంగా తెలుగు జాతి హృదయాలను తాకింది అమర గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు గానం మాత్రమేనని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ అన్నారు. ఘంటసాల వెంకటేశ్వరరావు ఘంటసాల గ్రామంలో గానకచేరి చేయగా చల్లపల్లి జమిందారు శ్రీమంతురాజా యార్లగడ్డ శివరామ ప్రసాద్ బహదూర్ వారికి గండ పెండేరం తొడిగి, గజారోహణతో సత్కరించి 58 ఏళ్లు అయిన సందర్భంగా సోమవారం ఏర్పాటు చేసిన ఘంటసాల హెరిటేజ్ వాక్ ను ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఘంటసాల వెంకటేశ్వరరావు భారీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పక్కనే ఉన్న గౌతమ బుద్ధుని విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ర్యాలీగా గాయక ఘంటసాల గానకచేరికి ముందు విశ్రాంతి తీసుకున్న వేములపల్లి శేఖరం ఇంటికి వెళ్లి ఆయన్ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎన్నారై వేమూరి రాజేష్, టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరి బాబు, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ, బండి పరాత్పరరావు, కొండపల్లి రామకృష్ణ, లోయ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు



కోసూరువారిపాలెం(మోపిదేవి): కోసూరువారిపాలెంలో విద్యానికేతన్ యూపీ పాఠశాల 27వ వార్షికోత్సవం సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ గురుప్రసాద్ తొలుత జాతీయ జెండాను ఆవిష్కరించి, స్కూల్ అభివృద్ధి ప్రణాళికను చదివి వినిపించారు. అనంతరం అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఆకుల మాధురి ఆధ్వర్యంలో చిన్నారులు రోహన్ రాఘవ ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సర్పంచ్ కోసూరు అనూష చిన్నారులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.

పన్నుల భారం తగ్గించండి

మచిలీపట్నంటౌన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రజలపై భారాలు తగ్గిస్తామని ఇచ్చిన హామీని పాలకులు విస్మరించారని సీపీఎం మచిలీపట్నం నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం విమర్శించారు. పట్టణ ప్రాంత ప్రజలపై పన్నుల మోత భారాన్ని తగ్గించాలని సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యాన సోమవారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గత ఏడాది కంటే రూ. 12.67 కోట్ల భారాన్ని ప్రజలపై మోపుతుందన్నారు. మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 49,009 అసెస్మెంట్లకు 2024–25లో రూ. 11.27 కోట్లు ప్రజలపై భారాన్ని వేసిందన్నారు. 2025 – 26 సంవత్సరానికి రూ.14.8 కోట్ల భారాన్ని ప్రజలపై రుద్దుతుందన్నారు. సుమారుగా రూ. 2. 81 కోట్లను ఈ సంవత్సరం నగర ప్రజలపై అదనపు భారాన్ని కూటమి ప్రభుత్వం వేస్తుందన్నారు. ఈ భారాన్ని వెంటనే తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే విద్యుత్ ట్రూఅప్ చార్జీలు, గ్యాస్ భారాలు అధికమయ్యాయన్నారు. చిరు వ్యాపారుల ఉపాధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సీనియర్ నేత కొడాలి శర్మ మాట్లాడుతూ మచిలీపట్నం ప్రజలకు ప్రతిరోజూ తాగునీరు అందించాలని, దానికి శాశ్వత పరిష్కారం కనుగొనాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో నేతలు సీహెచ్ జయరావు, టి.చంద్రపాల్, ఎండీ యునాస్ తదితరులు పాల్గొన్నారు.